రోడ్ల నిర్మాణం, నిర్వహణ బాధ్యత ఇక ప్రైవేటుకే

- హ్యామ్ విధానంలో 15 ఏండ్లు ఇచ్చేలా చర్యలు
- మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని రోడ్ల నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మండలాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి మిస్సింగ్ లింక్‌రోడ్ల నిర్మాణం, నిర్వహణ, అప్‌గ్రేడేషన్ పనులను హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడ్)విధానం లో చేపట్టాలని సంకల్పించింది. ఈ విషయమై బుధవారం రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని, పనుల్లో వేగం పెంచాలని, కన్సల్టెంట్లను గుర్తించి డీపీఆర్‌లు సిద్ధం చే యాలని ఆదేశించారు. ఈ విధానంలో 15 ఏండ్లపాటు రోడ్ల నిర్వహణ బాధ్యత సంబంధిత కన్సల్టెంట్‌కే ఉండనున్నందున నాణ్యతలో రాజీపడకుండా ఇంజినీర్లు పనులను తనిఖీ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు 82 నియోజకవర్గాల్లో గుర్తించిన 16 90.26 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతుల ను ప్రారంభించేలా టెండర్ల ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు.

పాఠశాల విద్యలో విలీనం చేయండి

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : మాడల్ స్కూళ్లను పాఠశాల విద్యలో విలీనం చేయాలని ప్రొగ్రెసివ్ మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లో బుధవారం పీఎంటీఏ టీఎస్ క్యాలెండర్, డైరీని మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెల్త్‌కార్డులు, కారుణ్య నియామకాలు, ప్రమోషన్లు ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరాల జగదీశ్, అనుమల పోచయ్య డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ గడబిడ



> మొదటిపేజీ తరువాయి...

ముందస్తు వ్యూహరచన లేకుండా బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలను తెరమీదకు తేవడం పట్ల ఢిల్లీ పెద్దల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర కాంగ్రెస్‌లో ఆసక్తికర పరిణామాలు సంభవిస్తున్నాయి.

ఇప్పటికే పార్టీ ఎమ్మెల్యేల తిరుగుబాటు

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు పాలనపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. బాహాటంగానే ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. కొందరు మంత్రులు, మరీ ముఖ్యంగా వలస వచ్చి ఆధిపత్యం చెలాయిస్తున్న నేతలపై పార్టీలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు తీవ్రంగా కలతచెందారు. ఆ కొద్దిమంది నేతల వ్యవహారశైలితో ఇప్పటికే పార్టీలోని నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారనే టాక్ వినిపిస్తున్నది. పాత, కొత్త నాయకుల మధ్య ఎక్కడా పొసగడం లేదనే ప్రచారం జరుగుతున్నది. ఇటీవల పలుచోట్ల ఘర్షణలు కూడా చోటుచేసుకోవడం ఆ వాదనలకు బలాన్ని చేకూర్చుతున్నది. దీనికితోడు ఇటీవల కాంగ్రెస్ పార్టీకి 10మంది ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశమవ్వడం మరింత వేడెక్కించింది. ఈ భేటీలో కొంతమంది మంత్రుల వ్యవహారశైలిపై అంతర్గతంగా చర్చించుకోవడం, తమ పనులే కావడం లేదని, కొద్దిమంది నేతలకు సంబంధించిన పనులనే చేస్తున్నారని ఒకరితో ఒకరు అసంతృప్తి వ్యక్తంచేసుకున్నట్టు సమాచారం. రహస్య భేటీ వ్యవహారం బయటకు పొక్కడం చర్చనీయాంశంగా మారింది. విషయం తెలిసి కాంగ్రెస్ అధిష్ఠానం కలవరానికి గురైంది. ప్రభుత్వ పెద్దల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తంచేయడమే కాకుండా, వెంటనే ఎమ్మెల్యేలతో భేటీ కావాలని, వారితో చర్చించాలని ఆదేశించినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఇటీవలనే జిల్లాలవారీగా ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి భేటీ కానున్నట్టు ప్రకటించారు. ఇప్పటికీ ఆ వివాదం కొనసాగుతున్నది.

తాజాగా కులచిచ్చు

ఒకవైపు ఇప్పటికే పార్టీ ఎమ్మెల్యేలు కొందరు మంత్రుల తీరుపై అసంతృప్తితో రెండువర్గాలు చీలిపోగా, తాజాగా కులచిచ్చు కూడా రగులుకున్నదని తెలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు సంబంధించిన నివేదికను అసెంబ్లీలో వెల్లడించింది. అదే సమయంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి ఏకసభ్య కమిషన్ సిఫారసులను ఆమోదించింది. ఆ రెండు అంశాలు ఇప్పుడు కాంగ్రెస్‌నే హడలెత్తిస్తున్నాయి. తమ జనాభా శాతాన్ని తగ్గించి చూపారని, ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నామని పార్టీలోని బీసీ నేతలు, ఎమ్మెల్యేలు రగిలిపోతున్నారు. దీనిని అగ్రకుల సర్వేగా అభివర్ణిస్తూ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్సీ సర్వే నివేదికను కాల్చడం, తాజాగా సదరు నేతకు నోటీసులు ఇవ్వడం పార్టీలో విభేదాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ విషయంపై అధిష్ఠానానికి కొందరు ఫిర్యాదులు చేసినట్టు సమాచారం. మరోవైపు, మరికొందరు బీసీ నేతలు తమ జనాభా శాతం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో డిప్యూటీ సీఎం పదవితోపాటు మరో మూడు మంత్రి పదవులు ఇవ్వాలని హైకమాండ్ వద్ద పట్టుబడుతున్నట్టు తెలుస్తున్నది. మరోవైపు, వర్గీకరణకు సంబంధించి తీవ్ర అన్యాయం చేశారంటూ దళితనేతలు సైతం తిరుగుబాటు బావుటాను ఎగరేసినట్టు తెలుస్తున్నది. మొత్తంగా బీసీ ఎమ్మెల్యేలు, దళిత ఎమ్మెల్యేల్లో అనుకూల, అననుకూల వర్గాలుగా చీలిపోయి పార్టీ హైకమాండ్‌కు మొరపెట్టుకుంటున్నట్టు సమాచారం. దీంతో పార్టీ అధిష్ఠానం ఎవరికి ఏ సమాధానం చెప్పాలో, ఏవిధంగా నచ్చచెప్పాలో తెలియక గందరగోళంలో పడినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వ పెద్దల తీరు, మంత్రుల వ్యవహార శైలి, ప్రభుత్వ నడవడిపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం.

ఖర్గేతో మాల నేతల భేటీ!

ఎస్సీ వర్గీకరణ అమలు అంశంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ మాల సామాజిక వర్గానికి చెందిన పలువురు నేతలు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయినట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నేతృత్వంలో పలువురు నేతలు హుటాహుటిన ఢిల్లీ వెళ్లినట్టు సమాచారం. వర్గీకరణ వల్ల మాల సామాజికవర్గం యావత్ కాంగ్రెస్‌కు దూరమవుతుందని, పార్టీకి ఇది తీరని నష్టాన్ని కలిగిస్తుందని చెప్పినట్టు తెలుస్తున్నది. ఒకవర్గం లాబీతో, మెప్పు పొందేందుకు ప్రభుత్వ పెద్దలు ఏకపక్షంగా వర్గీకరణ అమలు నిర్ణయం తీసుకున్నారని ఫిర్యాదు చేసినట్టు సమాచారం. వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని, వర్గీకరణ అమలుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసేందుకు ఒక కమిటీని వేయాలని డిమాండ్ చేసినట్టు తెలుస్తున్నది. కమిటీ సిఫారసుల ప్రకారం వర్గీకరణ అమలుపై ముందుకుపోవాలని పట్టుబట్టినట్టు ఆ పార్టీ నేతలే చెప్తున్నారు.

ఎమ్మెల్యేలు, ఫిరాయింపు ఎమ్మెల్యేల ఫిర్యాదులు

పార్టీ, ప్రభుత్వం తీరుపై సుమారు 15 మంది ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానానికి వివిధ రూపాల్లో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. వీరంతా ఎవరికి తోచినట్టు వారు ఫిర్యాదులు చేశారు. వీరితోపాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు కూడా తమ భవిష్యత్తుపై పార్టీ అధిష్ఠానానికి మొరపెట్టుకున్నట్టు సమాచారం. సుప్రీంకోర్టులో అనర్హత వేటు పిటిషన్‌పై వాదనలు జరుగుతుండటం, సుప్రీంకోర్టు ఆగ్రహంగా ఉండటం, అనర్హత వేటు పడితే ప్రత్యామ్నాయం ఏమిటన్నదానిపై స్పష్టత లేకపోవడంతో ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో దడ మొదలైంది. ఇదే విషయాన్ని తేల్చుకునేందుకు పలువురు ఫిరాయింపు ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బుధవారం పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. తనకు కూడా పార్టీ అధిష్ఠానం సమయం ఇవ్వాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఖర్గేను కోరినట్టు తెలిసింది. వీరి బాటలోనే మరికొందరు ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా పార్టీ అధిష్ఠానంతోనే తేల్చుకుందామన్న ఆలోచనతో ఉన్నట్టు సమాచారం. ఇక వీరితోపాటు కాంగ్రెస్ బీ ఫాంతో గెలిచిన 15 మంది ఎమ్మెల్యేలు వివిధ రూపాల్లో రాష్ట్రంలోని పార్టీ, ప్రభుత్వం తీరుపై ఆరోపణలు చేస్తూ అధిష్ఠానాన్ని ఆశ్రయించారు. తాజాగా ఎస్సీ వర్గీకరణ అంశంలో రాష్ట్ర పార్టీ, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అధిష్ఠానాన్ని కలిసి తీవ్ర నిరసన వ్యక్తంచేసినట్టు సమాచారం. వీటన్నింటిపై పార్టీ అధిష్ఠానం రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, దీపాదాస్ మున్షీతో చర్చించే అవకాశం ఉన్నది.

పీసీసీ కూర్పు, క్యాబినెట్ విస్తరణ ఉంటుందా?

పీసీసీ కూర్పు, మంత్రివర్గ విస్తరణపై కూడా పార్టీ అధిష్ఠానం గురు, శుక్రవారాల్లో ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే 14 నెలలుగా రాష్ట్రంలో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయాలంటూ పార్టీ ఎమ్మెల్యేల నుంచి అధిష్ఠానం తీవ్ర ఒత్తిడి ఉన్నది. మంత్రివర్గంతోపాటు నామినేటెడ్ పదవుల భర్తీ అంశంపై కూడా పార్టీ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉన్నదని చెప్తున్నారు.

31వ సారి ఢిల్లీకి రేవంత్

రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత గడిచిన 14 నెలల్లో రేవంత్‌రెడ్డి 30 సార్లు ఢిల్లీకి వెళ్లగా.. గురువారం పర్యటన 31వది కానున్నది.

నేడు సీఎల్పీ భేటీ.. ఢిల్లీకి సీఎం, పీసీసీ చీఫ్

రేవంత్‌రెడ్డి సర్కార్ అనాలోచితంగా నిర్ణయాలు తీసుకోవడాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా తప్పుబట్టినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో హుటాహుటిన ఢిల్లీ పిలిచినట్టు సమాచారం. వాస్తవంగా అసంతృప్త ఎమ్మెల్యేతో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తొలుత నిర్ణయించారు. అదేవిధంగా జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ ఉంటుందని ప్రకటించారు. అధిష్ఠానం ఆగ్రహం నేపథ్యంలో ముందస్తుగా నిర్ణయించిన ఎమ్మెల్యేలతో సమావేశాన్ని సీఎల్పీ సమావేశంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఉదయం 11 గంటలకు జరగనున్న సీఎల్పీ సమావేశానికి ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు, ఎంపీలను కూడా ఆహ్వానించారు. మధ్యాహ్నం 3 గంటలకు కాకుండా అంతకంటే ముందే ఉదయం 11 గంటలకే సీఎల్పీ నిర్వహించాలని నిర్ణయించడం హాట్‌టాపిక్‌గా మారింది. మధ్యాహ్నంలోపు సీఎల్పీ భేటీని పూర్తి చేసుకొని తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా ముఖ్య నేతలంతా ఢిల్లీకి పయనమవుతారు. ఢిల్లీ పర్యటనపై అధికారికంగా ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించకపోయినప్పటికీ, పలువురు కాంగ్రెస్ నాయకులు మాత్రం ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు సహా ముఖ్యనేతలంతా ఢిల్లీకి వెళ్తున్నట్టు ధ్రువీకరించారు. కీలక నేతలను తక్షణం ఢిల్లీకి రావాల్సిందిగా అధిష్ఠానం ఆదేశించిన నేపథ్యంలో రాజకీయవర్గాల్లో, కాంగ్రెస్ నేతల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మొత్తంగా కాంగ్రెస్‌లో ఏదో జరుగుతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

బీసీలకు డిప్యూటీ సీఎం ఇవ్వాలి

> మొదటిపేజీ తరువాయి...



వెళ్లాలని నిర్ణయించుకున్న నేతలు.. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ద్వారా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోరినట్టు ప్రచారం జరుగుతున్నది. అంతేకాదు, ఇటీవల సంచలనం సృష్టించిన పది మంది అసమ్మతి ఎమ్మెల్యేల భేటీపై కూడా తమ అభిప్రాయాలు చెప్పేందుకు సిద్ధమవుతున్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

డిపాజిట్లు దక్కని అసెంబ్లీ సీట్లు అంటగట్టారు

అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేసి, సామాజిక న్యాయం చేస్తామని రాహుల్‌గాంధీ మాట ఇచ్చారని, ఈ ప్రకారం ఎక్కువ జనాభా కలిగిన తమకు ఉప ముఖ్యమంత్రి పదవి వస్తుందని బీసీ నేతలు వాదిస్తున్నారు. తమకంటే తక్కువ జనాభా ఉన్న అగ్రకులాలకు ఏడు మంత్రి పదవులు, మరో సామాజిక వర్గానికి ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చారని గుర్తుచేసున్నారు. తమకు జనాభాకు తగ్గట్టు రాజ్యాధికారంలో వాటా లేదని, ఇద్దరికీ మాత్రమే మంత్రి పదవులు ఇచ్చారని బీసీ ప్రజాప్రతినిధులు చెప్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ బీసీలే త్యాగం చేయాల్సి వచ్చిందని వాపోతున్నారు. ఉదయపూర్ డిక్లరేషన్ మేరకు ప్రతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లును బీసీలకు కేటాయిస్తామని పీసీసీ అధ్యక్షునిగా రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి మాట తప్పారని కాంగ్రెస్ పార్టీ చెందిన సీనియర్ బీసీ నాయకుడు ఒకరు ఆరోపించారు. బీసీలకు 34 సీట్లు రావాల్సి ఉండగా, 21 సీట్లు మాత్రమే ఇచ్చారని బీసీ నేతలు ప్రస్తావిస్తున్నారు. ఇందులో యాకుత్‌పురా, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్టలో గత యాభై ఏండ్లుగా కాంగ్రెస్‌కు ఎన్నడూ డిపాజిట్ కూడా రాలేదని, ఇలాంటి అసెంబ్లీ స్థానాలను బీసీలకు కట్టబెట్టారని గుర్తుచేశారు.

48 నియోజకవర్గాల్లో బీసీ జనాభాను తగ్గించే కుట్ర!

రాష్ట్రంలోని 48 నియోజకవర్గాల్లో బీసీ ఓటర్లు అధికంగా ఉన్నారని, ఆయా నియోజకవర్గాల్లో బీసీల సంఖ్య తక్కువ చేసి చూపించేలా కులగణన జరిగిందని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక ఎమ్మెల్యే 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో అన్నారు. ఇటీవల ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ప్రజాప్రతినిధుల సమావేశాన్ని అగ్రవర్ణ ఎమ్మెల్యేలే లీడ్ చేశారని, కానీ వారి మీద ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, పైగా వారి కోసమే హడావుడిగా మంత్రివర్గ సమావేశం, గురువారం ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటుచేశారని సదరు బీసీ ఎమ్మెల్యే మనసులో మాట చెప్పారు. కానీ, తప్పుల తడకగా ఉన్న కులగణన, బీసీ జనాభా నివేదికను బీసీ ఎమ్మెల్సీ ఒకరు తప్పుపడితే మాత్రం ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పట్టుబడుతున్నారని బీసీ ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వంలో అగ్రవర్ణాలకు చెందిన మంత్రుల మాటే చెల్లుబాటు అవుతున్నదని, బీసీలను కూరలో కరివేపాకు మాదిరిగా తీసివేస్తున్నారని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తంచేశారు.

ప్రణీత్‌రావు బెయిల్ పిటిషన్ దాఖలు

ఈ నెల 7కి విచారణ వాయిదా

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ అధికారి ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు తరపున మొదటి అదనపు జిల్లా కోర్టులో బుధవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డికి న్యాయవాది నోటీసులు ఇచ్చారు. కాగా, విచారణను ఈ నెల 7కి వాయిదా వేస్తూ జిల్లా జడ్జి రమాకాంత్ ఉత్తర్వులు చేస్తూ, కౌంటర్ దాఖలు చేయాలని పీపీని ఆదేశించారు. కేసులో రెండో నిందితుడిగా ప్రణీత్‌రావు 11 నెలలుగా చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. కాగా, ఇదే కేసులో నిందితులైన భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావుకు సుప్రీం, హైకోర్టులు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ప్రణీత్‌రావుకు కూడా షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఇద్దరు మిర్చి రైతుల ఆత్మహత్య

ఇప్పటికి రాలిన మట్టిపూలు 418

- దిగుబడులు రాక.. అప్పులు తీర్చలేక మనస్తాపం
- హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాలో విషాదం

మొగిలి (ఫైల్)

పరకాల/కురవి, ఫిబ్రవరి 5: ఆశించిన దిగుబడులు రాక.. చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపంతో హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా పరకాల మండలం పైడిపల్లికి చెందిన పసుల మొగిలి తనకున్న ఎకరన్నర పొలంలో సుమారు రూ.రెండు లక్షల వరకు అప్పు చేసి మిర్చి సాగు చేస్తున్నాడు. పంట దిగుబడి రాకపోవడంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 1న ఇంట్లో వాళ్లు కూలీ పనికి వెళ్లగా, మొగిలి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కాగా బుధవారం గ్రామ శివారులోని పొలం వద్ద పురుగుల మందు తాగి మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

బాలకిషన్(ఫైల్)

హుమ్లాతండాలో మరో రైతు

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తుల్స్యాతండా పంచాయతీ పరిధిలోని హుమ్లాతండాకు చెందిన బానోత్ బాలకిషన్ (36) తనకున్న మూడెకరాల్లో ఎకరం వరి, రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. ఎకరం మిర్చి పంటకు రోగం రావడంతో తొలగించి మక్కజొన్న వేశాడు. దిగుబడి రాక అప్పులు పెరిగాయి. సుమారు రూ.10 లక్షల అప్పు ఉంటుందని తండావాసులు తెలిపారు. ఆర్థిక సమస్యలతో కుంగిపోయి బుధవారం ఇంటి ఆవరణలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య జాను, కుమారుడు సంజయ్, కుమార్తె సంకీర్తన ఉన్నారు.

మగ్గం నేస్తూ నేత కార్మికుడి మృతి

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 5: నేత కార్మికుడు మగ్గం నేస్తూనే గుండెపోటుకు గురై మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన వరంగల్‌లో బుధవారం చోటుచేసుకున్నది. నగరంలోని 12వ డివిజన్ సెకండ్ డాక్టర్స్ కాలనీలోని మైనార్టీ కాలనీకి చెందిన ఆడెపు కుమారస్వామి (32) రోజు మాదిరిగానే మగ్గం నేస్తుండగా అకస్మాత్తుగా గుండెనొప్పికి గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందాడు. కుమారస్వామికి భార్య, మూడునెలల పాప ఉన్నది.

గిరిజన సంక్షేమ నిధులు మళ్లించొద్దు

- గిరిజన పాఠశాలలకు 250 కోట్లు కేటాయింపు
- ఎస్టీ ఎమ్మెల్యేలతో సమావేశంలో మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను ఎమ్మెల్యేలు ఇతర అవసరాలకు కోసం మళ్లించవద్దని మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క సూచించారు. బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమభవన్‌లో ఎస్టీ ఎమ్మెల్యేలతో మంత్రి సమావేశం నిర్వహించారు. గిరిజన పాఠశాలలు, వసతి గృహాల్లో భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కోసం రూ.250 కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 15న గిరిజన పాఠశాలలు, తండాల్లో సేవాలాల్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉత్సవాల కోసం ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించిందని తెలిపారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్, విప్ రామచంద్రనాయక్, మురళీనాయక్, రామదాస్‌నాయక్, వెద్మా బొజ్జు, జాలే ఆదినారాయణ, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, ఎంపీ బలరాం నాయక్, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్, అధికారులు పాల్గొన్నారు.

ఎకరం వరకు రైతుభరోసా జమ

17.03 లక్షల రైతుల ఖాతాల్లోకి : తుమ్మల

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా ఒక ఎకరం వరకు సాగు భూములున్న రైతులకు బుధవారం రైతుభరోసా నిధులు జమ చేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఒక ఎకరం వరకు సాగులో ఉన్న 17.03 లక్షల రైతుల అకౌంట్లలో నిధులు జమ చేసినట్టు వివరించారు. ప్రారంభోత్స వం రోజు విడుదలచేసినవాటితో కలిపి ఇప్పటి వరకు మొత్తం రూ.1,126.54 కోట్లు రైతుభరోసా కింద జమ చేసినట్టు వెల్లడించారు. యాసంగి సీజన్‌లో కూడా సన్న ధాన్యానికి రూ.500 బోనస్ కొనసాగిస్తామని చెప్పారు.

కృష్ణా, తుంగభద్ర నదులకు నీటిని వదలండి

కన్నడ సీఎంను కలిసి విజ్ఞప్తి చేసిన మంత్రి, ఎమ్మెల్యేలు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 5 : సాగు, తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ బుధవారం బెంగళూరుకు చేరుకున్నారు. సీఎం సిద్ద రామయ్యని కలిసి సాగు, తాగునీటి అవసరాలకు నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాల డ్యాంకు 5 టీఎంసీలు కృష్ణానదికి.. తుంగభద్ర నదికి ఒక టీఎంసీ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

తప్పులుంటే 7లోపు సవరించుకోండి

ఇంటర్‌బోర్డు వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : ఇంటర్మీడియట్ నామినల్ రోల్స్‌లో తప్పులను సవరించుకునేందుకు అధికారులు అవకాశం ఇచ్చారు. నామినల్ రోల్స్‌ను కాలేజీ లాగిన్‌లో పొందుపరిచారు. ఏవైనా తప్పులున్నట్లయితే ఈ నెల 7వ తేదీలోపు సవరించుకోవాలని ఇంటర్‌బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ అవకాశం ఇవ్వబోమని స్పష్టంచేశారు.

రైతులు తగ్గారు.. భూమి పెరిగింది!

> మొదటిపేజీ తరువాయి...

విడుదల చేసినట్టు వెల్లడించింది. ఈ లెక్కన ఎకరానికి రూ.6 వేల చొప్పున 18,77,567 ఎకరాలకు రైతుభరోసా పంపిణీ చేసింది.

రైతుల సంఖ్య తగ్గితే.. భూమి ఎలా పెరుగుతుంది ?

గత వానకాలం రైతుభరోసా లెక్కలను ఈ యాసంగి లెక్కలను పోల్చితో లెక్కల్లో తీవ్ర గందరగోళం కనిపిస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో 2023 వానకాలంలో రైతుబంధు పంపిణీకి, కాంగ్రెస్ సర్కారు ఈ యాసంగిలో చేసిన పంపిణీ చేస్తున్న లెక్కలను పరిశీలిస్తే ఈ గందరగోళం బయటపడుతుంది. వానకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరం వరకు గల 22,55,181 మంది రైతులకు చెందిన 12,85,147 ఎకరాలకు రూ. 642.57 కోట్లు రైతుబంధు అందజేసింది. ఇక కాంగ్రెస్ సర్కారు ఈ యాసంగిలో ఎకరం వరకు గల 21,45,330 మంది రైతులకు చెందిన 18,77,567 ఎకరాలకు రూ. 6వేల చొప్పున రూ.1126.54 కోట్లు విడుదల చేసింది. అంటే గత వానకాలంతో పోల్చితే ఈ యాసంగిలో 1,09,851 మంది రైతులు తగ్గారు. కానీ భూమి విస్తీర్ణం మాత్రం గతంతో పోల్చితే 5,92,420 ఎకరాలు పెరిగింది. రైతుల సంఖ్య తగ్గి భూమి విస్తీర్ణం పెరగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది కాంగ్రెస్ సర్కారు మార్క్ మాయాజాలం అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పనికిరాని భూముల తీసేస్తే.. భూమి ఎలా పెరిగింది

గత ప్రభుత్వం రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలకు, వెంచర్లకు రైతుబంధు ఇచ్చిందంటూ విమర్శించిన కాంగ్రెస్.. దీనిపై ఇటీవల సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో 2 లక్షల నుంచి 2.5 లక్షల ఎకరాల వరకు